
# ప్రేమపాశం

'సుమ'



అవి నేను ఆఫీసులో కొత్తగా చేరిన రోజులు. అప్పుడు రోజుకు ఇరవై నాలుగు గంటలున్నా చాలని స్థితి. పుస్తకాలు చదివి నేర్చుకున్న దాని ద్వారా ఏదో సాధించాలన్న ఆత్రం.

మొదటిసారిగా "తనని" చూడగానే మనసులో ఏదో తెలియని మోహం. అందరూ తనని కోరేవారే!

ఎందుకంత అందం స్వంతం చేసుకు పుట్టాలి. దివి నుంచి భువికి దిగి వచ్చినట్లుండేది తను.

సుబ్బారావు, రామ్మూర్తి, ఖాన్, అక్కౌంటెంట్ రాజన్ అందరికీ తనంటే అంతులేని ఆపేక్ష. ఎవరికి వాళ్ళే తమ స్వంతం చేసుకోవాలనుకునేవాళ్ళు.

ఎవ్వరికీ అందకుండా ఊరిస్తూ నిలిచిన ఆ అందం.

ఇంతకు ముందు ఎందరు ఆ ఒడిలో తనివితీరా సేదదీరారో! ఆ చేతులు ఎంత మందిని లాలించాయో! అయినా దేవతలకు ముసలితనం, వయస్సు మారడం ఏమిటీ?

ఎన్నేళ్ళుంటాయంటే సుబ్బారావ్, "ఓ నలభై ఉండవూ?" అని దీర్ఘం తీశాడు.

అయినా ఆ ఠీవి, రాజసం, మరొకరికి రమ్మన్నా వస్తాయా? అయినా ఆ లక్షణాలన్నీ ఏకరువు పెట్టడానికి నేనేమన్నా కవినా? బొమ్మ వేద్దామంటే కనీసం చిత్రకారుణ్ణయినా కాను."

"పుస్తకాల్లో రాసింది చదివి నువ్వు దాన్ని గెలుచుకోగలననుకుంటే - అది నీ భ్రమ అనే వాడు" రాజన్.

నేను లెక్క చేస్తానా? నా కష్టం నాది, ఫలితం భారం అంత కాలానిది. మొత్తం ఆఫీసంతా అదే యావ? కొత్తగా చేరిన నాతో సహా ఎవరిని చూసినా సిగ్గుపడడం అనేదే లేదు.

ఓహ్! తలుచుకుంటేనే ఒళ్ళంతా పులకరింతలు. తనకి ప్రత్యేకంగా ఓ గది - టేబుల్ పైన ఎదురుగా ఎర్రని ఫోన్. చుట్టూ కిటికీలకు వెనీషియన్ బ్లైండ్స్, ఎండ పొడ తగిలితే కందిపోతుందేమో!

ఎవరికీ సొంతం కాని "తనని" చూస్తే అందరికీ - ఆశ - మోహం - అనుక్షణం ఆరాటం. ఒడిలో వాలాలని ఆరాటం. దాని కోసం అనునిత్యం పోరాటం.

పుస్తకాల పురుగునైన నేను సైతం - చుట్టూ ఉన్న స్నేహితుల్ని కాకాబట్టి కొంత నేర్చుకుని పోరాటానికి సిద్ధమయ్యాను.

అక్కౌంటెంట్ రాజన్ అనుభవం ద్వారా లోబరచుకుని స్వంతం చేసుకోవాలనుకున్నాడు.

ఏమయితేనేం దేవుడు నా పక్షాన ఉన్నాడు. విజయలక్ష్మి నన్నే వరించింది.

తడబడే గుండెలతో గదిలో అడుగు పెట్టాడు. నా సొంతమైన, నా రాణిని కన్నులారా చూసుకున్నాను. ఆ ఒడి నా సొంతమవాలని తలుచుకుని పులకించిపోయాను.

నా కష్టానికి ఫలితం అనుభవిద్దామని ఉవ్విళ్ళూరుతూ అడుగులు ముందుకేస్తున్నాను...

...

"ఆగాగు, అప్పుడే ఆ కుర్చీలో కూర్చోకు! ఎన్నో పరీక్షలు, ఇంటర్వ్యూలు నెగ్గి ప్రమోషన్ కొట్టావ్! పార్టీ చెయ్యకుండానే దాన్ని అనుభవిద్దాం అనుకున్నావా?" అంటూ లోపలికి దూసుకొచ్చాడు.

నా కలల రాణిని చేరడానికి వేస్తున్న అడుగును వెనక్కి తీసుకుని ఆ కుర్చీకేసి చూస్తూ - హొటల్ వైపు నడిచాను. *